క్లుప్తంగా

నీలమణిదుర్గకు జడ్జి పూజలు



నీలమణిదుర్గ ఆలయంలో జడ్జి ఫణికుమార్

పాతపట్నం: ఉత్కలాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణిదుర్గ అమ్మవారిని ఎస్సీ, ఎస్టీ 4వ అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం.ఫణికుమార్ ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వాదాలు అందజేశారు. ముందుగా ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. పాతపట్నం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి, ఏఎస్ఐ టి.శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది, అర్చకులు ఉన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో..

మెళియాపుట్టి: స్థానిక వేణుగోపాలస్వామి వారిని జడ్జి మహేంద్రఫణి కుటుంబ సమేతంగా సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించి శిల్పకళను ఆసక్తిగా తిలకించారు. అర్చకులు గోపీనాథ్‌రథో ఆలయ చరిత్రను వివరించారు.

కృష్ణమాదిగ రాక



కృష్ణమాదిగకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఆమదాలవలస: ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణమాదిగ ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం ఆమదాలవలస వచ్చారు. ఆయనను ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా పలికారు. టీడీపీ రాష్ట్ర క్రైస్తవ మైనార్టీ ఉపాధ్యక్షులు రాడ విజయ్‌కుమార్.. కృష్ణ మాదిగకు పూలమాల వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడారు. జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు లోపింటి తేజేశ్వరరావు రాజు, కృష్ణ, భాస్కరరావు, ఎస్.రామారావు, లోపింటి నారాయణరావు ఉన్నారు.

కుప్పిలి కవితకు జాతీయస్థాయి ప్రశంస



కుప్పిలి వెంకటరాజారావు

ఆమదాలవలస: ఆమదాలవలసకు చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావు మాస్టార్ జాతీయస్థాయి కవితల పోటీల్లో ప్రతిభ కనబర్చారు. సెప్టెంబర్ నెలలో ఎస్–7 గూగుల్ సంస్థ జాతీయ స్థాయి ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఇంగ్లిష్ కవితల పోటీల్లో ప్రతిభ కనబర్చడం ద్వారా ప్రశంసా పత్రం లభించిందని ఆదివారం తెలిపారు. సమాజంలో వికృత పోకడలపై తాను రచించిన డార్క్‌సీన్ (చీకటి దృశ్యం) కవితకు ప్రశంసలు లభించినట్లు పేర్కొన్నారు.

మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి



మంజునాథ్ బాయిజీని అభినందిస్తున్న దృశ్యం

కొత్తూరు: మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలంటే ఇతరుల మనసుకు భంగం కలిగించకుండా మెలగాలని బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ మంజునాథ్ బాయిజీ అన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా కొత్తూరులోని ఈశ్వరీయ బ్రహ్మకుమారి మందిరంలో రాజయోగ అభ్యాసాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుర్గుణాలు వదిలినప్పుడే వ్యక్తి జీవితం శాంతియుతంగా, ఖుషీగా ఉంటుందన్నారు. అందరూ శాంతియుతంగా ఉన్నప్పుడే సమాజం శాంతియుతంగా ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మంజునాథ్ బాయిజీని కేంద్రం ప్రతినిధులు దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో మందిరం ఇన్‌చార్జిలు సద్మ, సరస్వతి, లోతుగెడ్డ తాతబాబు, కాశీబాబు, తులసీవరప్రసాదరావు పాల్గొన్నారు.

నేటినుంచి 'పల్లె పండుగ'

హిరమండలం: పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న హిరమండలం, మర్రిగూడ, 15న అక్కరాపల్లి, పిండ్రువాడ, మహలక్ష్మీపురం, భగిరధిపురం, పిండ్రువాడ, అంబావల్లి, కిట్టాలపాడు, 16న దుగడ, కొమనాపల్లి, తంప, ధనుపురం, కల్లట, ఎం.అవలంగి, 17న తుంగతంపర, గొట్టా, లోకొండ, చొర్లంగి, 18న సుభలయ ఆర్‌ఆర్‌కాలనీ, కొండరాగోలు, గులుమూరు, పెద్దగూడ గ్రామ పంచాయితీల పరిధిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

కొత్తూరు: మండలంలోని 43 గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాలకు మంజూరైన 101 పనులను ప్రారంభిస్తామన్నారు.

ఎప్పుడు ప్రారంభిస్తారో?



గ్రామ సచివాలయ భవనం ఫ్లోరింగ్‌లో పుట్టుకువచ్చిన పిచ్చిమొక్కలు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనం

- ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనాలు



ప్రారంభోత్సవానికి నోచుకోని గ్రామ సచివాలయ భవనం

ఎల్.ఎన్.పేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ పరిపాలన ప్రజల వద్దకు తీసుకురావాలనే ఆశయంతో గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కార్యాలయ భవనాలు ఆయా గ్రామ సచివాయాల పరిధిలో నిర్మించారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గ్రామ సచివాలయ, రైతు భరోసా, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలు నిర్మాణం చేపట్టారు. నిర్మాణాలు పూర్తయ్యే సమయానికి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో నిర్మాణాలు పూర్తయిన భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టిసారించలేదు. చాలా గ్రామాల్లో ఇలాంటి భవనాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఉదాహరణకు ఎల్.ఎన్.పేట మండలంలోని పెద్దకొల్లివలస పునరావాస కాలనీలో నిర్మించిన భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. పునరావాస కాలనీలో ఎప్పుడో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌లో గ్రామ సచివాలయంతో పాటు ఇతర పరిపాలనను ప్రారంభించారు. అప్పటి నుంచి కమ్యూనిటీ హాల్లోనే పరిపాలన కొనసాగుతుంది. కమ్యూనిటీ భవనంలో విధులు నిర్వహించేందుకు గ్రామ సచివాలయ ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు నిర్మాణం పూర్తయినప్పటికీ భవనాలు ప్రారంభించక పోవటంతో వీటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి.. ఫ్లోరింగ్ నుంచి పిచ్చి మొక్కలు పుట్టుకొస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి నిర్మాణం పూర్తి చేసుకున్న గ్రామ సచివాలయ, విలేజ్ క్లినిక్ భవనాలు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

నిలిచిపోయిన ఆస్పత్రి ప్రహరీ నిర్మాణం



ఆస్పత్రి ముందుభాగంలో పిల్లర్స్ వేసి గోడ నిర్మించకుండా ఉన్న దృశ్యం



కోవెలవీధి వైపు ప్రహరీ లేక అధ్వానంగా ఉన్న ఆస్పత్రి ఆవరణ

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రి చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ పనుల అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. ఆస్పత్రిని రూ. 12 కోట్లతో అభివృద్ధి చేస్తుండగా దీంట్లో భాగంగా ప్రహరీ కూడా నిర్మించాల్సి ఉంది. కొంతభాగంగా నిర్మించగా.. ఆస్పత్రి ముందు భాగం, వెనుక కోవెలవీధి వైపు నిర్మించలేదు. ముందు భాగంలో రోడ్డును విస్తరించాలనే ఉద్దేశంతో పాత గోడ కంటే రెండు అడుగులు లోపలికి నిర్మించాలని భావించారు. అనంతరం పనులు నిలిచి పోయాయి. దీంతో ఆస్పత్ర ఆవరణలోకి కొంతమంది చొరబడి పాడు చేస్తున్నారు. తమకు రక్షణ లేకుండా పోతుందని వైద్యులు, నర్సులు ఆవేదన చెందుతున్నారు. ప్రహరీ నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

హిరమండలంలో ఫ్లెక్సీ వార్!



చించివేతకు గురైన జనసేన ఫ్లెక్సీ



కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

హిరమండలం: జిల్లాలో జనసేనకు కనీస ప్రాతినిధ్యం లేదు. దీంతో పాతపట్నం నియోజకవర్గాల్లో టీడీపీ శ్రేణులు జనసేన నాయకులకు గౌరవం ఇవ్వడం లేదు. వారిని కనీసం కలుపుకొని వెళ్లే ప్రయత్నం చేయడం లేదు. పాతపట్నం నియోజకవర్గంలో అయితే జనసేన నేతలను కనీసం పరిగణలోకి తీసుకోవడం లేదు. ఆ పార్టీ నియోజకవర్గ మహిళా నాయకురాలు కొరికాన భవానీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించేశారు. దీనిపై ఇదివరకు జనసైనికులు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. అయినప్పటికీ ఫ్లెక్సీల చించువేత ఆగడంలేదు.

తాజాగా హిరమండలం గొట్టా బ్యారేజీ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చించివేతకు గురైంది. టీడీపీ నాయకులే ఈ పని చేయించి ఉంటారన్న అనుమానం జనసేన కార్యకర్తల్లో ఉంది. ఈ నేపథ్యంలో చించివేసిన ఫ్లెక్సీ స్థానంలో భవానీ.. కొత్తగా కుక్కలు, చెప్పులతో ఉన్న మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది.

రెల్లిగడ్డిపూలతో ఇబ్బందులు



అలికాం–బత్తిలి రోడ్డుకి ఇరువైపులా ఉన్న రెల్లిగడ్డి పూలు

ఎల్.ఎన్.పేట: చింతలబడవంజ, రావిచెంద్రి సెంటర్ల నుంచి ఎల్.ఎన్.పేట మండల కేంద్రం వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల అలికాం–బత్తిలి (ఎబీ) ప్రధాన రహదారికి ఇరువైపులా రెల్లిగడ్డి పూలు విస్తరించాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రెల్లిగడ్డి పూలు గాలికి ఎగిరివచ్చి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, సైకిళ్లపై వెళుతున్న ప్రయాణికుల కళ్లలో పడుతున్నాయి. రెల్లిగడ్డి పూలు కంట్లో పడినప్పుడు ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ పూలు కంట్లో పడటం వలన నేత్ర సంబంధిత సమస్యలు తలెత్తే ప్రయాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. రోడ్డుకు రెండువైపులా ఉన్న రెల్లిగడ్డిని తొలగించేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సచివాలయాలకు కార్యదర్శులు కరువు!



సరుబుజ్జిలి గ్రామసచివాలయం

సరుబుజ్జిలి: మండలంలోని పలు గ్రామ సచివాలయాలకు కార్యదర్శులు లేరు. సోమవారం నుంచి ప్రభుత్వం పల్లెపండుగ వారోత్సవాలు నిర్వహించనుంది. అయితే సాధారణ ఉద్యోగుల బదిలీల తరువాత ఇప్పటివరకు తెలికిపెంట, చిగురువలస, సరుబుజ్జిలి, ఇస్కలపాలెం గ్రామ సచివాలయాలకు పంచాయితీ కార్యదర్శులుగా ఎవ్వరూ బాధ్యతలు స్వీకరించలేదు. గతంలో పనిచేసిన కార్యదర్శులు రిలీవ్ కావడంతో ఆయా సచివాలయల్లో డిజిటల్ అసిస్టెంట్లకు కార్యదర్శులుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీ వ్యవహారాల్లో వీరికి ఎటువంటి అవగాహన లేదు. అధికారులు ఆయా సచివాలయాల్లో రెగ్యులర్ కార్యదర్శుల నియామకానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలి



ప్రమాదకరమైన మలుపు

సరుబుజ్జిలి: అలికాం–బత్తిలి ఆర్‌అండ్‌బీ రహదారిలో మునగవలస జంక్షన్ మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంవలన తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి పక్కనే బస్‌షెల్టర్‌తో పాటు మలుపు ఉండడంవలనతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. రాత్రివేళల్లో ఈ రహదారిలో కొత్తగా ప్రయాణించే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మలుపు వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఏపీ టెట్‌కు 598 మంది హాజరు

నరసన్నపేట: స్థానిక కోర్ టెక్నాలజీలో ఆదివారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 598 మంది హాజరయ్యారు. ఉదయం షిఫ్టులో 330 మందికి 303, మధ్యాహ్నం 330 మందికి 295 మంది హాజరయ్యారు. 62 మంది గైర్హాజరు అయ్యారని ఎంఈవో దాలినాయుడు తెలిపారు.

మద్యం దరఖాస్తుదారులు 7 గంటలకు చేరుకోవాలి

పాతపట్నం: పాతపట్నం, సారవకోట మండలాల్లోని మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకున్న వ్యక్తులు సోమవారం ఉదయం ఏడు గంటలకు శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియం వద్దకు చేరుకోవాలని పాతపట్నం ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు ఆదివారం తెలిపారు. ఎనిమిది గంటలకు ఆడిటోరియంలో లాటరీ తీసి దుకాణాలను కేటాయిస్తారన్నారు.

భరతనాట్యంలో చిన్నారి ప్రతిభ



ప్రదర్శన ఇస్తున్న హిమశ్రీ

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామంలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పంచాయితీ స్థాయిలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో భరతనాట్యం విభాగం నుంచి గ్రామానికి చెందిన చిన్నారి రేజేటి సాయిహిమశ్రీ ప్రథమంగా నిలిచింది. చిన్నారికి గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

రోడ్డుపైనే మురుగు నీరు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

సారవకోట: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తుంది. మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లో వాడుతున్న నీరు రోడ్డుపైనే ప్రవహిస్తుంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా గొయ్యి



ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేట పాతబస్టాండ్ సమీపంలోని బజారు స్టేట్‌బ్యాంక్ వద్ద మెయిన్ రోడ్డుపై ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా ఉంది. రెండు రోజులుగా ఇది ఏర్పడిన అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రమాదం పొంచి ఉందని ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని గొయ్యిని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

పెరిగిన ధరలతో జనం విలవిల

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల పాలనలో పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు విలవిల్లాడుతున్నాయని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిత్యావసర సరుకులతో పాటు కూరగాయల ధరలు పెరిగిపోవటంతో ప్రజలు దసరా పండుగను ఆనందంగా చేసుకోలేని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలల పాలనలో చంద్రబాబు ప్రభుత్వం సాధించిన అభివృద్ధి ఏదైనా ఉందంటే ఆది ధరల పెరుగుదల ఒక్కటే అని చెప్పుకోవచ్చని ఆరోపించారు. ధరల పెరుగుదల మన రాష్ట్రంలో ఉన్నంతగా మరే రాష్ట్రంలోను లేదన్నారు. అధికార దాహంతో అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చిన చంద్రబాబుకు ఎన్నికల ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా? అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేసేందుకు చంద్రబాబుకు ఎంత కాలం కావాలో ప్రజలకు తెలియజేయాలని నిలదీశారు. నాలుగేళ్ల కాలయాపన చేసి ఆఖరి సంవత్సరంలో అమలు చేస్తారా? అని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కాక ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల పాలనలో కరోనా మహమ్మారి విరుచుకుపడి ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నప్పటికీ సంక్షేమ పథకాలు అమలు చేయటంలో వెనుకంజ వేయలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అమ్మఒడి, రైతు భరోసా, చేయూత, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, ఆటో యజమానులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారికి అందించే ఆర్థిక సహాయం సకాలంలో అందజేశారని గుర్తు చేశారు. చంద్రబాబు చేతిలో మోసపోయినట్లు నాలుగు నెలల్లోనే ప్రజలు తెలుసుకున్నారని అన్నారు.

మిన్నంటిన దసరా సందడి

విజయదశమిని ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో..సందడిగా జరుపుకున్నారు. ఇళ్లు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. వాహనాలకు పూజలు చేసి ఎటువంటి అవరోధాలు లేకుండా చూడాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మరోపక్క శరన్నవరాత్రి ఉత్సవాలు కూడా ముగిశాయి. దీంతో మండపాల్లో ప్రతిష్టించిన దుర్గమ్మ విగ్రహాలను భారీ వాహనాలపై ఉంచి బాణసంచా కాల్పులు, యువకుల నృత్యాల నడుమ తీసుకొని వెళ్లి చెరువులు, నదుల్లో నిమజ్జనం చేశారు. అమ్మవారికి కానుకులుగా సమర్పించిన చీరలు, ప్రసాదం లడ్డూలను ఉత్సవ కమిటీ సభ్యులు వేలం వేయగా భక్తులు ఉత్సాహంగా పాల్గొని సొంతం చేసుకున్నారు.

–సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: నిమజ్జనానికి తరలిస్తున్న దుర్గాదేవి విగ్రహం



ఎల్.ఎన్.పేట:తురకపేట సెంటర్‌లో అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు



పాతపట్నం: తిరువీధుల్లో చిన్నారుల కోలాట ప్రదర్శన



పాతపట్నం: అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



సారవకోట: దుర్గాదేవి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో అమ్మవారి చీరలను వేలంలో దక్కించుకున్న మహిళలు



కొత్తూరు: కొత్తూరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఆమదాలవలస: మెట్టక్కివలసలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రవికుమార్



బూర్జ: లడ్డూ ప్రసాదాన్ని రూ.36,500కి దక్కించుకున్న ఏనుగుల అనంతకుమార్



బూర్జ: అన్నంపేటలో నిమజ్జనానికి తరలివెళ్తున్న దుర్గాదేవి



హిరమండలం: వాహనాలకు పూజలు చేస్తున్న దృశ్యం



పొందూరు: రాపాకలో అమ్మవారి కలశాన్ని రూ. 63,500కు దక్కించుకున్న వండాన రిషిత



హిరమండలం: దుర్గాదేవి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకువెళ్తున్న భక్తులు